క్లుప్తంగా

నేడు మహిళాశక్తి సమ్మేళనం

హన్మకొండ కల్చరల్: మహిళల్లో చైతన్యం కలిగించడం ద్వారా భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను పరిరక్షించడం, దేశ సమగ్ర అభివృద్ధిలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి మహిళాశక్తి సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు సమ్మేళనం సమితి బాధ్యులు పోకల జ్యోతి, సముద్రాల కవిత, వాంకుడోతు జ్యోతి శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వరంగల్ భద్రకాళి దేవాలయం సమీపంలోని కీర్తి గార్డెన్స్‌లో ఆదివారం సమ్మేళనం జరగనుందని పేర్కొన్నారు.

నేడు ఎస్టీయూ సమావేశం

విద్యారణ్యపురి: స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్రం (ఎస్టీయూటీఎస్) రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశాన్ని ఈనెల 25న హనుమకొండలోని ఎస్టీయూ భవనంలో నిర్వహించనున్నట్లు ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సదయ్య శనివారం తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పర్వతరెడ్డి అధ్యక్షతన జరగనున్న సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం గౌడ్, రాష్ట్ర బాధ్యులు, 33 జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు.

నేడు అభివృద్ధి కమిటీ ఎన్నిక

మడికొండ: మెయిన్ రోడ్డులోని శ్మశాన వాటిక అభివృద్ధి, నిర్వహణకు ఆదివారం మడికొండ బొడ్రాయి వద్ద సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా కమిటీని ఎన్నుకోనున్నట్లు తెలిపారు.

రేపు త్రిపుర గవర్నర్‌కు ఆత్మీయ పౌర సన్మానం

నయీంనగర్: త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డికి ఓరుగల్లు సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్డు కన్వెన్షన్ హాల్‌లో సోమవారం సాయంత్రం ఆత్మీయ పౌర సన్మానం నిర్వహించనున్నట్లు ఓరుగల్లు సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు ఏ.సమ్మిరెడ్డి తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మిరెడ్డి మాట్లాడుతూ ఇంద్రసేనారెడ్డికి వరంగల్‌తో చాలా అనుబంధం ఉందని అన్నారు. బంధుమిత్రులు, అనుబంధ సంఘాలు, నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగరాజు, రామచందర్ పాల్గొన్నారు.

వచ్చేనెల 28న కేయూ అకడమిక్ సెనేట్ సమావేశం

కేయూ క్యాంపస్: కేయూ 39వ అకడమిక్ సెనేట్ సమావేశాన్ని ఈఏడాది మార్చి 28న ఉదయం 11 గంటలకు పరిపాలనా భవనంలోని సెనేట్ హాల్‌లో నిర్వహించనున్నట్లు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య మల్లారెడ్డి శనివారం తెలిపారు. ఈమేరకు అకాడమిక్ సెనేట్‌లోని సభ్యులకు, వర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లకు, సంబంధిత అధికారులకు సమాచారమిస్తూ.. ఉత్తర్వులు కూడా జారీ చేశారు.

అంతర్జాతీయ సదస్సుకు ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు

కేయూ క్యాంపస్: మహారాష్ట్రలోని పూణే ప్రాంతంలో ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు (ఇంటర్నేషనల్ పౌడర్ మెటల్లుర్జీ పెర్ట్యూలేట్ మెటీరియల్స్ ఎగ్జిబిషన్ -2024) సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్జాతీయ సదస్సుకు హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలోని ఫిజిక్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జితేందర్, డాక్టర్ ప్రవీణ్ పాల్గొనబోతున్నట్లు ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య శనివారం తెలిపారు.

ఘనంగా దర్గా ఉర్సు

ఖిలా వరంగల్: మధ్యకోటలోని హజ్రత్ చందా షహీద్ దర్గాలో గంధం, ఉర్సు ఉత్సవాలు శనివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గంధం ఉత్సవాలు జరిగాయి. కార్యక్రమంలో పీఠాధిపతి ఉబేద్‌బాబా, అశ్రఫ్, వాహిద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల అప్పగింత

ఖిలా వరంగల్: తల్లీ బిడ్డా అదృశ్యమైన కేసును 24గంటలలోపు పోలీసులు ఛేదించారు. భర్త వేధింపులు తాళలేక మనస్థాపంతో ఇంట్లో నుంచి వెళ్లిన మహిళతోపాటు ఆమె బిడ్డను బంధువులకు క్షేమంగా అప్పగించినట్లు మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

తుమ్మలను కలిసిన మార్నేని

కాజీపేట అర్బన్: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో నిర్వహిస్తున్న ఏఐసీబీఈఏ (ఆల్ ఇండియా కోఆపరేటివ్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్) 8వ సమావేశంలో మంత్రిని కలిసి డీసీసీబీ బ్యాంకు డైరీతోపాటు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

ఎంపీగా అవకాశం ఇవ్వాలి

వరంగల్ లీగల్: న్యాయవాది బైరపాక జయాకర్‌కు బీఆర్ఎస్ పార్టీ నుంచి వరంగల్ ఎంపీ టికెట్ ఇప్పించాలని ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు కోరారు. ఈమేరకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావును హనుమకొండలోని ఆయన స్వగృహంలో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు.

మేడారానికి తగ్గిన ప్రయాణికుల రద్దీ

- ఇంటిబాట పట్టిన భక్తులు
- కిటకిటలాడుతున్న వరంగల్ రైల్వే స్టేషన్, బస్ స్టేషన్



పండ్ల మార్కెట్ బస్టాప్ వద్ద భక్తులు



వరంగల్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు

కాశిబుగ్గ: వరంగల్‌లోని మేడారం బస్ పాయింట్‌లో ప్రయాణికుల రద్దీ తగ్గింది. మేడారం జాతరకు ప్రజలను తరలించేందుకు వరంగల్ రైల్వే స్టేషన్ సమీపం ఎస్ఎస్ఎం క్లబ్ ఎదురుగా స్పెషల్ బస్ పాయింట్‌ను ఆర్టీసీ అధికారులు గత ఆదివారం ప్రారంభించారు. అప్పటి నుంచి నాలుగు క్యూలైన్ల ద్వారా పగలు, రాత్రి ప్రయాణికులను ఎప్పటికప్పుడు బస్సుల్లో అధికారులు తరలించారు. ఆదివారం నుంచి శనివారం మధ్యాహ్నం వరకు 1,608 ట్రిప్పుల్లో 65,696 మందిని మేడారానికి తరలించినట్లు వరంగల్ బస్ పాయింట్ అధికారులు తెలిపారు. వారిలో 36,881 మంది పురుషులు ఉండగా మహిళలు 28,815 మంది ఉన్నారని వివరించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలను ఉచితంగానే మేడారం తరలించినట్లు తెలిపారు. శనివారంతో జాతర ముగిసినా ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో మేడారం వెళ్లే అవకాశం ఉండడంతో ఆదివారం కూడా మేడారం బస్ పాయింట్‌ను కొనసాగించనున్నట్లు ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కిటకిటలాడుతున్న వరంగల్ రైల్వే స్టేషన్

మేడారం జాతరకు రాకపోకలు సాగించే ప్రయాణికులతో వరంగల్ రైల్వే స్టేషన్ కిటకిటలాడుతోంది. మేడారం జాతర కోసం దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు మూడు ప్రత్యేక రైళ్లు నడిపారు. అలాగే, శుక్రవారం ఖమ్మం నుంచి మరో ప్రత్యేక రైలును నడిపారు. రైళ్లలో అధిక సంఖ్యలో భక్తులు వరంగల్ స్టేషన్‌కు చేరుకుని మేడారం బస్‌పాయింట్ నుంచి జాతరకు వెళ్లారు. జాతర వెళ్లి అనంతరం వరంగల్ రైల్వే స్టేషన్‌కు వచ్చి రైళ్లలో తమతమ సొంత ప్రాంతాలకు ప్రజలు తరలివెళ్తున్నారు.

'పీజీ మొదటి సెమిస్టర్' వాయిదా వేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీజీ కోర్సుల మొదటి సెమిస్టర్ పరీక్షలు వాయిదా వేయాలని పీడీఎస్‌యూ కేయూ ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్, బాధ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జ్యోతికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సెంట్రల్ గవర్నమెంట్‌కు సంబంధించిన జీడీ పరీక్షలు ఈనెల 21నుంచి మార్చి 7వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. అయితే, మార్చి 1నుంచి కాకతీయ యూనివర్సిటీలో పీజీ పరీక్షలు ఉండటంతో సెంట్రల్ గవర్నమెంట్‌కు సంబంధించిన పరీక్షను కొంత మంది విద్యార్థులు నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ బాధ్యులు గణేష్, వంశీ, పృథ్వీ, వేణు, భవాని, నథిత, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పీఎస్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట అర్బన్: బేగంపేట, రామంతాపూర్‌లలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో (హెచ్‌పీఎస్) 1వ తరగతి డేస్కాలర్ ప్రవేశానికి హనుమకొండ జిల్లాలోని ఎస్సీ బాలికల నుంచి 2024 -2025వ విద్యా సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హనుమకొండ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి బి.నిర్మల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25నుంచి మార్చి 12వ తేదీలోపు దరఖాస్తులను హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లోని జిల్లా సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, అలాగే హసన్‌పర్తిలోని ఎస్సీ బాలుర వసతి గృహంలోని సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

విభూదితో అభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకులు

కాజీపేట: మాఘ మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దేవాలయంలో శనివారం స్వామి వారికి విభూదితో ఘనంగా అభిషేకం నిర్వహించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు అయినవోలు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో సిద్ధి, బుద్ధి సమేత గణపతికి కనుల పండువగా నిత్య కల్యాణోత్సవాన్ని అర్చకులు జరిపించారు. ఆలయ మాఢ వీధుల్లో దేవి, దేవేరుల ఉత్సవ విగ్రహాలను సంప్రదాయ పద్ధతిలో ఊరేగించారు. ఉత్సవాలను తిలకించడానికి భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నపూర్ణ కేంద్రంలో మహాన్నదానం చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేశ్వర్లు శర్మ, రాధాకృష్ణ శర్మ, హరిస్వామి, టంటం దయాకర శర్మ, మణిదీప్, రవి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూలో విద్యార్థినులపై కుక్క దాడి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పద్మాక్షి మహిళా హాస్టల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులను శుక్రవారం రాత్రి హాస్టల్ సమీపంలో కుక్క కరిచింది. దీంతో గాయాలు కావడంతో క్షతగాత్రులకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ శ్రీనివాస్‌రావు శనివారం తెలిపారు. ఇదిలా ఉండగా క్యాంపస్‌లోని కుక్కలను పట్టించి బయట వదిలివేసినట్లు శ్రీనివాస్‌రావు తెలిపారు. సుమారు 15కుక్కలు పట్టించి వేరేచోటుకు తరలించి వదిలివేసినట్లు వివరించారు. కాగా, యూనివర్సిటీలో కుక్కల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ కేయూ సహాయ కార్యదర్శి స్టాలిన్ డిమాండ్ చేశారు.

సత్యనారాయణస్వామి వ్రతం



కాశిబుగ్గ: కాశిబుగ్గ రంగనాథస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వ్రతంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. పూజల్లో కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, వీక్కి, సభ్యులు సుల్తానా సమ్మక్క, పుష్పలీల, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసి సిబ్బంది నిజాయితీ

కాజీపేట: కాజీపేట పట్టణంలో మేడారం జాతర కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో మరిచిపోయిన హ్యాండ్ బ్యాగులతో పాటు విలువైన వస్తువులను బాధితురాలికి ఆర్టీసీ సిబ్బంది అప్పగించి నిజాయితీని చాటుకున్నారు.

ఆర్వోబీని తనిఖీ చేసిన రైల్వే అధికారులు



ఆర్వోబీ వద్ద ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న రైల్వే అధికారులు

- 26న వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ
- ఏర్పాట్లలో నిమగ్నమైన రైల్వే యంత్రాంగం

కాజీపేట రూరల్: గ్రేటర్ వరంగల్ కాజీపేట–హసన్‌పర్తి రైల్వే స్టేషన్ల మధ్య ఉన్న వడ్డేపల్లి రైల్వే గేట్ స్థానంలో నూతనంగా నిర్మించిన ఆర్వోబీని శనివారం రైల్వే అధికారులు తనిఖీ చేశారు. అమృత్ భారత్ రోడ్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా నిరూప్‌నగర్ తండా వద్ద నూతనంగా నిర్మించిన ఆర్వోబీ.. హైదరాబాద్–ఛత్తీస్‌ఘడ్–వరంగల్ నేషనల్ హైవేను అనుసంధానం చేస్తుందని అధికారులు తెలిపారు. స్థానికంగా రైళ్ల ట్రాఫిక్ ఉన్నప్పుడు రైల్వే గేట్ పడడడంతో వాహనదారులు, పాదచారులు ఎదుర్కొనే ఇబ్బందులు బ్రిడ్జి నిర్మాణంతో తొలగనున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా.. 554 రైల్వేస్టేషన్ల పురోభివృద్ధికి, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణంలో భాగంగా వడ్డెపల్లి 1వ నంబర్ రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ స్థానంలో ఇటీవల నిర్మించిన ఆర్వోబీని సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈమేరకు నూతనంగా నిర్మించిన ఆర్వోబీని, బ్రిడ్జికి అవతలివైపు, ఇవతలి వైపు తనిఖీ చేసి, ప్రారంభోత్సవ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, దక్షిణ మధ్య రైల్వే అధికారులు పాల్గొంటున్నట్లు వారు పేర్కొన్నారు. నూతన ఆర్వోబీని కాజీపేట రైల్వే డిప్యూటీ కన్‌స్ట్రక్షన్ ఇంజనీర్ సజ్జ భార్గవ్ కృష్ణ, సికింద్రాబాద్ రైల్వే సీనియర్ డీఈఈ ఎలక్ట్రికల్ మధుసాగర్, కాజీపేట రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బద్దియ నాయక్, రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సజ్జన్‌లాల్, ఎస్ఎస్ఈ విశ్వేశ్వర్‌రావు, అధికారులు ఉన్నారు.

మోదీతో ప్రజాస్వామ్యం అపహాస్యం



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్

ఖిలా వరంగల్: కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలతో దేశీయ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతూ రైతులపై ఉక్కుపాదాన్ని మోపుతూ ప్రజాస్వామ్యాన్ని ప్రధాని మోదీ అపహాస్యం చేస్తున్నారని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆరోపించారు. వరంగల్ అండర్‌బ్రిడ్జి సమీపంలోని ఎంసీపీఐ కార్యాలయంలో ఐతం నగేష్ అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో రమేష్ మాట్లాడారు. స్వదేశీ నినాదంతో అధికారంలోకి వచ్చిన బీజేపీ మోదీ ప్రభుత్వం.. ఆచరణలో విదేశీ కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాలతో దేశ సంపదను లూటీ చేస్తోందని అన్నారు. కార్యక్రమంలో నర్ర ప్రతాప్, నర్సయ్య, ఐలయ్య, నర్సయ్య, రవి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాల్వలను శుభ్రం చేయాలి




డ్రెయినేజీని పరిశీలిస్తున్న రామలింగం

కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీలోని పలు మురుగునీటి కాల్వలను మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది వెంటనే శుభ్రం చేయాలని మాజీ కార్పొరేటర్ నార్లగిరి రామలింగం డిమాండ్ చేశారు. కాలనీవాసులతో కలిసి పలు కాలనీల్లోని డ్రెయినేజీలను శనివారం పరిశీలించారు. కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారంతో మురుగునీరు నిల్వ ఉంటోందని ఆయన తెలిపారు. దాంతో దోమల బెడద అధికమై స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించాలని ఆయన కోరారు.

అపరాధ రుసుం సంగతేంటి?

25 రెట్ల పెనాల్టీతో రూ.24 కోట్ల పన్ను బకాయిలు

- మూడేళ్లకు సంబంధించి రూ.6 కోట్లు పెండింగ్
- ఎలా చెల్లించాలని ఇళ్ల యజమానుల ఆందోళన
- గ్రేటర్ రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యమే కారణం



వరంగల్ అర్బన్ : ప్రభుత్వం ఏమైనా కొత్తగా మార్గదర్శకాలు జారీచేస్తే పూర్తిస్థాయిలో అవగాహన చేసుకొని క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేసే బాధ్యత స్థానిక సంస్థలది. ప్రభుత్వశాఖలు ఆ మేరకు పన్నులు రాబట్టుకోవాలి. ఘనత కెక్కిన గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పన్నుల విభాగం అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం, అవగాహన రాహిత్యం కారణంగా సుమారు మూడేళ్లుగా 3,800 ఇళ్ల యజమానులపై 25 రేట్లు అదనపు ఆస్తి పన్ను పెనాల్టీ భారం రూ.24 కోట్లు పడింది. ఇళ్ల నిర్మాణదారులు ఆ పెనాల్టీ సొమ్ము చెల్లించేందుకు ఏ మాత్రం సుముఖంగా లేరు. దీంతో ఆస్తి, నీటి పన్నులు వసూలు కాకపోవడంతో మరో రూ.6 కోట్ల పన్నుల బకాయిలు పేరుకుపోయాయి. బల్దియా ఉన్నతాధికారులు మాత్రం లేఖలు రాశామని, ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుని జీఓ జారీ చేయాల్సిందేనని సెలవిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పురపాలక చట్టం–2019 అమల్లోకి తెచ్చింది. సంవత్సరాలు కావొస్తున్నా ఆ చట్టంపై రెవెన్యూ విభాగం అధికారులకు ఇంకా పూర్తి అవగాహన రాలేదు. దీంతో కొత్త ఇంటి నంబర్లు పొందిన యజమానులు భారీగా విధించిన పెనాల్టీతో గగ్గోలు పెడుతున్నారు.

ఆస్తిపన్ను స్వీయ మదింపుతోనే..

పురపాలక చట్టం ప్రకారం నూతన భవన నిర్మాణం లేదా పునఃనిర్మాణం కోసం భవన యజమాని ఆన్‌లైన్ ద్వారా స్వీయ ధ్రువీకరణ సమర్పించాలి. నిర్దిష్ట ప్లాట్ పరిమాణం, ప్లింత్ ప్రాంతం, అంతస్తులు, వినియోగించడానికి సంబంధించి యజమాని తన ఆస్తి పన్ను తానే మదింపు చేసుకుని పన్ను చెల్లించుకోవాలి. స్వీయ మదింపులో సరైన సమాచారం, కొలతల్లో తేడా ఉంటే వాస్తవ పన్ను మీద 25 రెట్లు అదనంగా పన్ను విధించాలని చట్టంలో స్పష్టంగా పొందుపరిచారు. ఈ నూతన చట్టంపై కొత్త ఇళ్ల యజమానులకు అవగాహన కల్పించలేకపోయారు. పన్నుల విభాగం అధికారులు, సిబ్బంది పట్టించుకోలేదు. కొత్త ఇంటి నంబర్ల కొలతల్లో వ్యత్యాసాలు ఉన్నా నామమాత్రంగా పన్ను విధించి అందినకాడికి దండుకొని ఇష్టారాజ్యంగా ఇంటి పన్ను విధించి, నంబర్లు కేటాయించారని ఆరోపణలు ఉన్నాయి.

రూ.95 లక్షలకు 25 రెట్ల అదనపు పెనాల్టీతో రూ.24 కోట్లు

పురపాలక చట్టం అమలు చేసిన తర్వాత బల్దియా ఉన్నతాధికారులు రెండేళ్ల తర్వాత గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ బల్దియా పరిధిలో సుమారు 2,600 మందికి వాస్తవ పన్ను విధించారు. కానీ, మరో 3,800 ఇళ్ల యజమానులకు కనీస అవగాహన లేకుండా, స్వీయ మదింపు కారణంగా రూ.95 లక్షల ఆస్తి పన్నుకు 25 రెట్ల అదనపు భారం రూ.24 కోట్లు పడింది. బల్దియా రెవెన్యూ సిబ్బంది మాత్రం స్వీయ మదింపునకు ఇళ్ల యజమానులే బాధ్యత వహించాల్సి ఉంటుందని దాటవేస్తున్నారు. దళారులు, బిల్ కలెక్టర్లు తమను మోసం చేశారని ఇళ్ల యజమానులు ఆందోళన చెందుతున్నారు. కొలతల వ్యత్యాసానికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లే కారణమని ఇంత పెద్ద మొత్తంలో పెనాల్టీలు ఎలా చెల్లిస్తామని ప్రశ్నిస్తున్నారు. పేరుకుపోయిన భారీ ఆస్తి పన్నుల బకాయిలు ప్రశ్నార్థకంగా మారాయి. ఉన్నతాధికారులు, పాలకవర్గం చొరవ చూపి సమస్య పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రభుత్వానికి లేఖలు రాశాం..

> పురపాలక చట్టంలో స్వీయ మదింపులో తేడాలు రాకుండా చూసుకోవాలని స్పష్టంగా పొందుపర్చింది. ఇంటి యజమానులు సరిగా నమోదు చేయించుకోకపోవడం వల్ల 25 రేట్లు అదనంగా పెనాల్టీ పడింది. గతంలో చాలామార్లు పురపాలక శాఖకు లేఖలు రాశాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. లేనిపక్షంలో బకాయిలు చెల్లించాల్సిందే.
>
> - అనిసుర్ రషీద్, బల్దియా అడిషనల్ కమిషనర్